# మాద్రి

శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి

౧

'నేనేం చేతునే మాతల్లీ! కన్నకడుపు అని అయినా జాలిలేకుండా ఇంత కటికవాడైనాడేమే నీతండ్రి!'

'అదేమిటి అమ్మమ్మా - నాన్న నా కోసమే ... నేను సుఖపడాలనేకాదూ ... చేసే యీ నిర్వాహకం!'

'హాయ్యో! నిర్భాగ్యురాలా ... నల్లనివన్నీ నీళ్లూ, తెల్లనివన్నీ పాలూ నీకంటికి... ఏలా బ్రతికి బట్టకడతావే.'

'ఇక, కట్టేవన్నీ బనారసుచీరలే! పెట్టిన నగపెట్టకుండా, తొడిగిన రవిక తొడగకుండా ... ఓఁ ... మహారాణి నౌతాను, నాకేం ... తీపెళ్లిందా? ... ఎంత వైభవం?'

'...భళ్లున తెల్లవారినట్టే ఉంది!'

'సందె పడేటప్పటికి గూట దీపం పెట్టేవారు లేరనేనా ... పాపం ... ఆతడు ఇంత తొందరపడుతూంది; మరేం, అంత ఊసు తప్పయితే, మగవాడికి కూడా విధవరికం మనశాస్త్రాల్లో. వ్రాసిపెట్టించకపోయినారూ? ఆపిల్లదానికి భూమ్మీద అనోన్నదకాలు కరవై ... అది పోయిందికదా అని ... ఇవతల ఈతడు అఘోరించుతూ కూర్చుండవలసినంత అవసరం ఏం వచ్చిందీ? తెల్లవారితే అప్పుడే నాలుగామెనా...యీవారం ఏలాగో కళ్లుమూసుకుంటే మైలస్నానం... మంగళస్నానం...రెండూ ఓమారే...'

'ఏమోలే, నీ కర్మానికి ... ఎవరు కర్తలు...'

'నా అదృష్టదేవతలు!...నోయాలసిన నోములకుఫలం...అప్పుడే అడ్వాన్సుగా నాకు దక్కుతూంటే ... చూసి చంకలు కొట్టుకుంటూ సంబర పడటానికి బదులు, ఏమిటి నిండిన యింట్లో కూర్చుని...ఇలా ఆగాయిత్యం'...

'చాల్లే... నాతో బాటు సంతోషించాలి కాని... బిక్కమొగం వేసుకుని లేనిపోని చిక్కు తెచ్చిపెట్టక ... ఇంకా వ్యవధిఉందా...యీలోపుగా మళ్లా తలుపుదగ్గిర పాటలూ ... తలుపు గడియ పడకముందు పాడాలిసిన పాటలూ...అప్పుడు నట్టుపడకుండా...ఓమారు వల్లించుకో...'

... ... ...

'కృష్ణా—

నిన్ను ఇంత చనువుగా పేరుపెట్టి పిలవలేదు...సిగ్గు విడిచి నీయెదటపడి మాట్లాడలేదు.'

'ఇప్పుడు...సిగ్గుపడి లాభంలేదు.'

'నా మనసులో ఏమున్నదో నీకు అంతు చిక్కించకపోయినా ... నీమనసులో కోరికలు ... ఎప్పటికప్పుడు, నీవు కిటికీదగ్గర నిలుచున్నప్పుడల్లా, నీచూపులు నాకు తెలుపుతూనే ఉన్నవి...

'కాని, ప్రయోజనం లేదు ... అందని ద్రాక్షపండు ... అది ఎవరి దోసిలిలో రాలితే ... మనకు ఒరిగేది ఏముంది ... అని మనసును వెన్నగా మళ్లించుకో...'

'నీకు అంత యిష్టమైతే ... అవసరమైతే...నన్ను జ్ఞాపకం ఉంచుకో!'

... ... ...

'తాతయ్యా! ...నవలల్లో చదువుతాం చూడు...పెద్దకోపం వచ్చినప్పుడు అందులో వీరుడు ఏంచేస్తాడు?-

'పళ్లు పటపటలాడించి జుట్టుపీక్కుంటూ'

'పాపం నీకాయోగం లేదుకదా ... ఈ వార్ధక్యంలో ... ఇదే ఇంకో పాతికేళ్ల క్రిందనైతేనా...'

'కాదులే... అప్పుడైనా నీ కాధాన్ను వచ్చేదికాదులే...యీ సినీమాలు ముదిరిన తరువాతనేగా ... నాలాంటి వెర్రిపిల్లలు కళ్లు తెరిచింది...'

'కంట నీరుపెట్టావో ... నామనసు చివుక్కుమంటుంది...నడుంకట్టుకుని పెత్తనం చేయవలసినవాడవు...జబ్బలు సవరించుకో.'

... ... ...

౨

'గృహిణి వచ్చి గూట దీపం పెట్టగానే...'

'మీకు-గుండె గుభీలుమనేలా గుంది అత్తా!...తెలిసినవారు, ఏలానడవాలో తీర్చి దిద్దుకోండి...'

'తెలిసింది...నాతెలివి తెల్లవారమట్టే హాయ్యో భగవంతుడా! మావాడిబ్రతుకు చివరకు ఇలా అఘోరించిందేమా అని ... నడవాలో కంట ఒత్తివేసుకుని పడగాపులు పడి...ఆలకిస్తున్నా...వాడిప్రాణానికి...'

'నేను దాపురించింది...ఆయన సుఖంగా ఉండటానికే కాదండీ...'

'ఈ శ్రీరంగనీతుల కేం...సందెపడగానే ... ఇప్పుడున్నబుద్ధి ... వాడు చెప్పలేక... చెప్ప లేక...పిచ్చపాడగట్టు...నాదగ్గిర బావురు మన్నాడు...సరి, చూద్దునుగదా... నీవాలకం...ఆడజన్మ ఎత్తింది...అణిగి మణిగిపడి ఉండటానికా ... మగవాడిని రాచిరంపానపెట్టడానికా...అక్కరలేని దానవు... అక్కర లేనట్టుగానే ఉండలేకపోయావూ? లేక...ఏరాజ్యాలన్నా ఏలుదా మనా ... యీాదిలాసా ?'

'వారూ మీరూ ... ఏరీ కోరీ కట్టబెట్టింది...యీ రాజ్యాన్నేకదా, ఏలడానికి! ఇంతకన్నా ఎక్కువ ... ఎక్కడమాత్రం దొరుకుతుందా?'

'ఆజ్ఞానం ఉంటేనా ... ఏలుకునేవాడు ఎంత పరితపించిపోతూన్నాడో అని కనికరం నీకు ఉంటేనా?...'

'—అమ్మా!

నా జన్మకు ఇహా సుఖపడేయోగం లేదేమోనమ్మా ... పెళ్లినాడు మెడనుపడ్డ జంధ్యం ... పెద్దదానితోనే పెరిగిపోయిందమ్మా...ఎన్ని ముడులు వేసినాఏంలాభం...'

'అయ్యో నాతండ్రీ! ... చూసి చూసి నీ కీరొమ్ముల కుంపటి ఎత్తానేమిగా? ఈ శిఖండితో ఏలా వేగుతావయ్యా!'

'ఏనాడు కష్టంతోస్తే...'జా పరమేశ్వరా' అని ఏకాశో లేచిపోతాను. నాక్షీడ

పిరగడ అయిపోతుంది ... పెళ్లాం ఉన్నా ... సన్యాసినే...'

'నా బొందిలో ఊపిరుండగా ... నీకు వచ్చిన ఫరవా ఏమీ లేదురా, నాయనా నీవాకిలి ఊడ్చటానికి వచ్చిన బానిస కూతురు ... నీ చెప్పుచేతల్లో పడి ఉండక ఏ చెరువునీళ్లు త్రాగుతుందో చూస్తాను గా ... మొండికి మొండే ప్రతి ... నీవు లాలించినకొద్దీ దాని ఆగడం ఇలాగే రెచ్చి పోతుంది. నాలుగుచరిచి అన్నా లొంగదీసు కోవాలి కాని... చెట్టైవంగనిది... ఇకముందు నీపాట్లు అడిగావూ...ఎద్దు నడిగి గంత కడ తారటరా...ఎక్కడన్నా ఉందా ఇది...నీ యిష్టం ఇక...అంతా నీచేతులో ఉంది...'

... ... ...

'మంచినీళ్లు కావాలి !'

'మీ అమ్మగారిని అడగండి'

'ఎంతమాట అన్నావూ! మానాభి మానాలు ఏకోర్జానా లేవుగదా...అమ్మని అడగాలా అంట!...అయితే మరి, బొమ్మవు నీ వెందుకూ...తినిపెట్టడానికా...'

'కాదు ... కనిపెంచడానికి తల ఒగ్గక పోతే...తినే ముద్దకూ కరువు వస్తుంది.'

'ఆమాట ఎత్తితే...నీకు ఎక్కడలేని తలనొప్పి... వేయిపుట్లు జ్వరమూ ముంచుకు వస్తుంది...'

'అవును ... నాముఖానే ప్రొద్దుపొడి చింది... నేనూ ఓమనిషి నే...'

'నేను ... మ్రాకును...అదేనా నీవ నేది...మూడు రోజులనుంచీ వళ్లు సలసలా కాగుతూంది...ఆశ్చేదిక్కు ఉంటేనా...'

'అన్నింటికీ మీకు దొరికింది...అదే వంక ... ఇలా అనుక్షణం పట్టి పల్లార్చు తూంటే ... ఎవతె బ్రతుకుతుంది ... మీ చేతుల్లో... ఈ కడగండ్లుగడిచి... పోయిందే అదృష్టవంతురా లనుకుంటే ... దానికి ప్రతిగా మళ్లా నేను వెలశాను ... వంటిం ట్లోకుండేలు ... మన్ని తప్పించుకుపోలేదు కదా అనేకాదూ మీ చెలగాటం...'

'అలా దోవకు రా...'

'మీకు ... ప్రాణంమీదన్నా ఆశ లేదూ?'

'ప్రాణంమీదకన్నా కూడా...'

'అంతేనా...'

'ఆహా ... బ్రతికిన నాలుగుగడియలూ సుఖపడకపోతే...'

'నేను ఎంత చెప్పినా... వినరు; మొర పెట్టుకున్నా ఆలకించరూ ... ఇక మనకూ ...పశువులకూ ఏమిటి తేడా...'

'పదిమాట్లకు ... వేయిమాట్లకు నేను పశువునే...నిన్ను చేసుకున్న తరువాత... నాకు అభిమానం ఎందుకూ? ఎంత వదరినా ఇప్పుడు నిన్ను వదిలేదిలేదు...చూద్దాం... నీతాత ఎవరు అడ్డం వస్తాడో...పద...'

'తాతజోలి ఎందుకులెండి ... ఆ కీర్తి నేనే దక్కించుకుంటాను...'

## 3

నాలుగు గడియల్లో ఎంతముంచుకు వచ్చిందీ...నా బంగారుతండ్రిని నీ పొట్టను పెట్టుకుంటావటే మహామారీ! ... తోడ కాదు... దీన్ని నిలువునా చీల్చండయ్యా

తండ్రుల్లారా... మాపాలిటికి ఎక్కడ దాపురించావే... నీముఖం...'

'ఊరుకోండి అత్తా...మన మేంచేయగలము? ఆమహారాజుకు భూమ్మీద చిట్టెడుప్పు కరువైపోయింది. పోయినవారితో మనం పోతామా... పోగలమా?... తాతయ్యా! పాపం...మావాళ్లకు ఎంతకామాటం అనుకున్నావు? స్వంతవ్యవసాయమా... ఇచ్చిపుచ్చుకోవడాలూ... గంపంత వ్యవహారం...ఒక్కర్తే తిప్పలుపడాలి ఇక...అయినా మెలిగినచేయికనుక ఇబ్బంది ఉండదులే...'

'ఏమనుకోమోకండమ్మ ... పైత్యంచి వెర్రిమాటలు వస్తున్నాయి దానికి...'

'నీవూ నీ మనుమరాలూ, కట్టకట్టుకుని గంగలో దూకండి...'

'—దూకమంటారేకాని ... లోకానికి వెరవాలిసిన అవసరం మనకేముంది అత్తా! మునిగినవారు ... మునగగా ... ఒడ్డుకు చేరినవాళ్లు...వంతు దీర్చుకోవద్దూ? కాదా మరి... తాతయ్యా!... సహధర్మచారిణి మరోవిధంగా నడుచుకుంటే ఆలోకంలో ఉన్న ఆయన మనసు ఎంతో బాధపడిపోదూ?...ఆయనే మిగిలి...దైవవశాన నేనే రాలిపోయి ఉంటే... ఆ సద్బ్రాహ్మణుడు... అత్తగారూ మూడోనాటికల్లా... గుమ్మటంలాంటి పడుచును ఎక్కడనుంచో ఏరి కోరి వెదుక్కుతెచ్చుకుని గృహపావనం చేసుకునేవారేనా?

' ఉత్తమగతుల ప్రాప్తి ఆశించేదాన్నే అయితే...ఆయన అడుగుజాడల్లో మెలిగితే ...నాకు ఎన్నిక ఉంది కాని...

'అత్తయ్యా! ఉరిమిచూడబోకండి శుభమస్తు అనడానికి బదులు నేనేమి లోపం చేయను...

' స్వరూపాలకి భేదమే కాని...భగవంతుడు నిర్దేశించిన వైవాహిక ధర్మస్వరూపం మారలేదని...నాపెళ్లినాడు... పెద్దలందరికీ మీరు నీతి ఉపదేశించినవారు కారండీ!... ఒప్పుకున్నాను.

' తాతయ్యా!... మైల వెళ్లిపోగానే మంచి ముహూర్తం ఏర్పాటు చేయి...... కృష్ణుని పెండ్లికొడుకును చేయించు ... కోపంతో కొరకొరలాడు... అంతే, నీపుణ్యమాయెను కాని... పండ్లు కొరకబోకు... మళ్లా కట్టించడం...ఇప్పుడు నాన్నకు మళ్లా అదో అదనపు ఖర్చు.

